## క్లుప్తంగా

### చిల్డ్రన్ పార్కు జిగేల్



పార్కులో నూతనంగా అమర్చిన ఎల్ఈడీ లైట్లు

**మల్కాపురం:** జీవీఎంసీ 60వ వార్డు వుడాకాలనీ చిల్డ్రన్ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్లతో పార్కుకు నూతన శోభ వచ్చింది. కాలనీలో సుమారు రూ. 50 లక్షల వ్యయంతో చిల్డ్రన్ పార్కు నిర్మించారు. దీంతో పాటు విద్యుత్ ఎల్ఈడీ లైట్లు పలు చోట్ల అమర్చారు.దీంతో పార్కు మరింత సుందరంగా కనిపించడంతో సాయంత్రం వేళ పిల్లలతో తల్లిదండ్రులు వస్తున్నారు.

### తల్లి చెంతకు బాలుడు



సింహాచలం రైల్వే స్టేషన్‌లో కుమారుడిని తల్లికి అప్పగిస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

**గోపాలపట్నం:** సింహాచలం రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న బాలుడు సూరాడ లతీష్‌ను ఆర్‌పీఎఫ్ పోలీసులు తల్లి చెంతకు చేర్చారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో ప్లాట్‌ఫారంపై స్కూల్ బ్యాగ్‌తో కనిపించిన బాలుడిని పోలీసులు ప్రశ్నించారు. ట్రైన్ టికెట్ లేక పోవడంతో అనుమానం వచ్చి వివరాలు అడగ్గా సరైన సమాధానం చెప్పలేదు. దీంతో తల్లి దండ్రుల ఫోన్‌నంబర్లు అడిగి తెలుసుకున్నారు. తల్లి కృష్ణవేణికి సమాచారమందించారు. వీరు పెందుర్తి మండలం సుజాతానగర్‌లో నివాసముంటున్నారు. చదవడం ఇష్టం లేపోవడంతో ఇంటి నుంచి వచ్చేశాడని చెబుతున్నారు. సింహాచలం రైల్వే స్టేషన్‌లో తల్లి కృష్ణ వేణికి స్టాఫ్ కె. అనిత, ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ కె. ఎస్.రావు బాలుడిని అప్పగించారు. దీంతో ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

### 3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

**ఉక్కునగరం:** శ్రీమహాదుర్గ, శ్రీమహాలక్ష్మి, శ్రీమహా సరస్వతి వెలసిన ఉక్కునగరంలోని త్రిశక్తి దేవాలయంలో అక్టోబర్ 3 నుంచి శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. 12 వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 4 న సహస్ర సంపెంగ పుష్పార్చన, 5న సహస్ర హస్త కంకణార్చన, 6న సహస్ర హరిద ఖండార్చన నిర్వహించనున్నారు. 7న సహస్ర కమల పుష్పార్చన, 8న సహస్ర కలువ పుష్పార్చన, 9న సామూహిక అక్షరాభ్యాసాలు, సాయంత్రం పిల్లలచే సామూహిక సరస్వతీ పూజ, సహస్ర శ్వేత కుసుమార్చన, 10న సహస్ర గులాబీ అర్చన, సాయంత్రం ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించనున్నారు. 11న సహస్ర వివిధ ఫలార్చన చేయనున్నారు. తొమ్మిది రోజుల పాటు ముగ్గురు అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్నారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని ఆయన ప్రధాన అర్చకుడు ఫణి శర్మ కోరారు.

### పవిత్రోత్సవంలో విశేష పూజలు

**డాబాగార్డెన్స్ :** పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం కనకమహాలక్ష్మి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 8 నుంచి గణపతి పూజ, పుణ్యాహవచన, సప్తకలశ ఆరాధన, అభిషేకం, ప్రధాన హోమాలు, నీరాజన మంత్ర పుష్పం జరిపారు. సాయంత్రం 6.30 నుంచి మహాశాంతి హోమం, నీరాజన మంత్ర పుష్పం జరిపారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి విశేష పూజలతో పాటు పవిత్ర విరమణ, మహాపూర్ణాహుతి, వేద ఆశీర్వచన చేయనున్నారు. మధ్యాహ్నం పంచామృతాభిషేకం అనంతరం 12.30 గంటల వరకు గర్భాలయ దర్శనాలు, ఆర్జిత సేవలు, శాశ్వత సేవలు నిలిపివేయనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.





పార్కు ముఖద్వారంపై ఉండాల్సిన బోర్డు ఇలా..



పార్కులో వ్యర్థాలు



వాకింగ్ చేస్తున్న వాకర్స్

# ఆహ్లాదం కనుమరుగు!

**పార్కు అంటే ఆహ్లాదం పంచాలి. చిన్నా పెద్దలు వ్యాయామం చేసుకోవడంతో పాటు సరదాగా గడపడానికి వేదిక. అలాంటి పార్కు అధికారులు, పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా కళావిహీనంగా మారింది. డంపింగ్ యార్డును తలపిస్తోంది. మంచినీరు.. మరుగు దొడ్డి వంటి సదుపాయం లేక వాకర్స్ అవస్థలు పడుతున్నారు.**

- కంపుకొడుతున్న మరుగుదొడ్డి
- కానరాని మంచినీటి సౌకర్యం
- పార్కు ఆవరణ వ్యర్థాలతో దర్శనం
- ఇబ్బంది పడుతున్న వాకర్స్
- అధికారుల పర్యవేక్షణ కరువాయే





ట్యాంక్ పెట్టారు..ట్యాప్ మరిచారు

**మల్కాపురం:** ఆరోగ్యం కోసం ఆ పార్కుకు వెళ్లే వారు అక్కడ వాతావరణంతో అసౌకర్యానికి గురవుతున్నారు. పార్కు చుట్టూ ఎండిన కొమ్మలు,ఆకులు,వాటర్ ప్యాకెట్లు,ఖైనీ ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. దుర్వాసన వెదజల్లడంతో గుల్లలపాలెం పార్కుకు వెళ్లడానికి సందర్శకులు విముఖత చూపుతున్నారు.

**ఇదీ పరిస్థితి**

జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెంలో 20 ఏళ్ల కిందట సుమారు రూ.15 లక్షల వ్యయంతో పార్కు నెలకొల్పారు. రెండు ఎకరాల విస్తీర్ణంలో వాకింగ్ పార్కు,సైకిల్ ట్రాక్‌తో పాటు ఆటపరికరాలు అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో సింథియా నుంచి జింక్ వరకు గల వాకర్స్ నిత్యం 500 మంది వరకు ఉదయం,సాయంత్రం ఇక్కడకు వచ్చి వాకింగ్ చేసేవారు. అయితే కొంత కాలం నుంచి వాకింగ్ పార్కు నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో ప్రాంగణం అంతా వ్యర్థాల మయంగా మారింది. వాకర్స్ కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి అపరిశుభ్రంగా ఉంది. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ట్యాంక్‌కు ట్యాప్ అమర్చలేదు. దీంతో తాగునీరుకు ఇబ్బంది పడుతున్నారు.

**ఆకతాయిల అడ్డా .**

పార్కులో నైట్ వాచ్‌మన్ లేకపోవడంతో రాత్రి సమయంలో ఆకతాయిలు పార్కులోకి ప్రవేశిస్తున్నారు. మద్యం, ధూమపానం చేసి పరిసరాలను జుగుప్సాకరంగా మారుస్తున్నారు. దీంతో పార్కులో ఎక్కడ చూసినా ఖైనీ, గుట్కా కవర్లు దర్శనమిస్తున్నాయి. మందుబాబులు సీసాలు ఇష్టానుసారంగా పడేస్తున్నారు.దీంతో మహిళలు రావడానికి ఇబ్బంది పడుతున్నారు.



తలుపు లేని మరుగుదొడ్డి

### క్షణం కూడా ఉండలేక పోతున్నాం



వాకింగ్ పార్కు ఆవరణ అంతా వ్యర్థాలతో నిండి ఉంది. తాగునీటి సౌకర్యం లేదు. ఇక్కడ సేద తీరుదామన్నా పార్కులో అపరిశుభ్ర వాతావరణం ఉంది. దీంతో ఒక్క క్షణం కూడా ఉండలేక పోతున్నాం.

– నర్సింగరావు, సివిల్ ఇంజినీర్

### తాగునీటి వసతి కల్పించాలి



పార్కులో తాగునీటి కోసం వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేశారు.కానీ దానికి ట్యాప్ వేయడం మరిచారు.దీంతో మంచినీరు తాగలేని పరిస్థితి. నైట్ వాచ్‌మన్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాలి.వాచ్‌మన్ లేకపోవడంతో పార్కులో ఆకతాయిలు చేరుతున్నారు.వీరి వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.

– మజ్జి రమేష్, పోర్టు ఉద్యోగి

### పార్కు నిర్వహణపై దృష్టిపెట్టాలి



పార్కు వచ్చే వారు మూత్ర విసర్జనకు వెళ్లాలంటే ఇబ్బందే. ఇక్కడ మరుగుదొడ్డి వెళ్తే లోపల అధ్వానంగా ఉంది. దుర్వాసన వెదజల్లడంతో పాటు బేసిన నాచు కట్టి ఉండడంతో చాలా ఇబ్బందికరంగా ఉంది. గతంలో మరుగుదొడ్డిని పారిశుద్ధ్య కార్మికులు శుభ్రపరిచే వారు. ప్రస్తుతం పట్టించుకోవడం లేదు. అధికారుల పార్కు నిర్వహణపై దృష్టిపెట్టాలి.

–ఉరుకూటి తాతారావుయాదవ్, సీఎల్‌డబ్ల్యూ కార్మికుడు

### వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న గ్రామాభ్యుదయ సేవా సంఘం సభ్యులు

**గోపాలపట్నం:** విజయవాడ వరద బాధితుల కోసం పద్మనాభనగర్ గ్రామాభ్యుదయ సేవా సంఘం సభ్యులు ఆదివారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నందవరపు సోములు మాట్లాడుతూ విజయవాడలో వరదల వల్ల ఎంతో మంది నిరాశ్రయులయ్యారని.. వారికి సాయం అందించేందుకు విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతిఒక్కరూ స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సాలాపు శ్రీనివాసరావు, కంప అప్పారావు, వల్లూరి జగదీష్, కంచిపాటి నాగరాజు పాల్గొన్నారు.

### తైక్వాండో క్రీడాకారుడికి సత్కారం



క్రీడాకారుడు ప్రకాశరావు, కోచ్ రుక్మాకరరావులను సత్కరిస్తున్న నిర్వాహకులు

**గోపాలపట్నం:** తైక్వాండో క్రీడలో విశేష ప్రతిభ కనబరిచిన మలిపర్తి ప్రకాశరావుతో పాటు కోచ్ పాండ్రంకి రుక్మాకరరావుకు ఘన సత్కారం లభించింది. ప్రకాశరావు ఈ నెల 26 నుంచి 30 వరకు మలేషియాలో జరగనున్న తైక్వాండో పోటీలకు వెళ్తున్న సందర్భంగా ఉచిత శిక్షణ ఇచ్చిన రుక్మారరావును కూడా ఆక్సిజన్ టవర్స్ ప్రెసిడెంట్ తిరుపతిరాజు, ఎలియన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ డి. పోలారావు ఘనంగా సత్కరించారు. పోటీల్లో గెలిచి దేశానికి కీర్తి తీసుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సభ్యులు ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఆధ్యాత్మిక చింతన అవసరం



గాంధీజీవీధి గణపతిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ తదితరులు



ఆర్‌కేపురంలో అన్నప్రసాదాలు వడ్డిస్తున్న కార్పొరేటర్ సుధ

**మల్కాపురం:** యువత ఆధ్యాత్మిక భావం కలిగి ఉండాలని,దైవ ప్రార్థన వల్ల మనసు ఎంతో ప్రశాంతంగా ఉంటుందని దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. 61వ వార్డు మల్కాపురం దరి గాంధీజీవీధిలో స్థానిక గాంధీజీ వీధి యంగ్ బాయ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని ఆదివారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ అన్న సమారాధనను ప్రారంభించారు. యువత ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు పేరు తేవాలని సూచించారు. జనసేన నాయకులు పుర్రె సురేష్‌యాదవ్,అంగ దుర్గా ప్రశాంతి,టీడీపీ నాయకులు కాకి పోలిరెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు గొంప శంకర్‌యాదవ్,నూనెల యశ్వంత్‌యాదవ్,భార్గవ్‌యాదవ్,నూకరాజుయాదవ్,అవినాష్ పాల్గొన్నారు.

- ఇదే వార్డు ఆర్‌కేపురం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని మండపాన్ని వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ దర్శించుకుని పూజలు చేశారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ప్రారంభించారు.
- శ్రీహరిపురం వద్ద జరిగిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొన్నారు. నిర్వాహకులు ఆయన్ను సత్కరించారు.

### శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



శాకాహార సద్భావన ర్యాలీలో పాల్గొన్న పిరమిడ్ సొసైటీ సభ్యులు

**గాజువాక:** పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్టు అనుబంధ సంస్థ పరమాత్మ పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని శ్రీనగర్ దరి దుర్గానగర్ జంక్షన్‌వద్ద పల్లా కార్తీక్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పల్లా కార్తీక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాకాహారంతో ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అనంతరం పిరమిడ్ సంస్థ సభ్యులు శాకాహారం ప్రయోజనాలపై దుర్గానగర్ పరిసర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్టు ప్రతినిధులు బి.అప్పారావు, ఎం.శివగణేశ్వరరావు, టి.రేవతీదేవి, పద్మావతి, బాలాజీ, కనకారావు, అప్పలనర్సమ్మ, సత్యనారాయణ, సుబుద్ధి, అప్పలరాజు, దేవిక, వర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## విశేషంగా అన్నసమారాధనలు



తారక రామా ఎన్‌క్లేవ్‌లో భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



కొత్తపాలెంలో భక్తులకు అన్నప్రసాదాలు వడ్డిస్తున్న రేణుకా గోపాలకృష్ణ

**గోపాలపట్నం:** గోపాలపట్నం, ఎన్‌ఏడీ ప్రాంతాల్లో వినాయక నవరాత్రుల సందర్భంగా పలు వీధుల్లోలాదివారం అన్నసమారాధనలు నిర్వహించారు. జీవీఎంసీ 52వ వార్డు తారకరామా ఎక్లేవ్‌లో నిర్వహించిన అన్న సమారాధనను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు.అలాగే సుసర్ల కాలనీ, బుచ్చిరాజుపాలెంలోని నిర్వహించిన అన్నసమారాధనల్లో శ్రీధర్ పాల్గొన్నారు.

- కొత్తపాలెం మిలీనియం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనను వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ ప్రారంభించారు.
- చంద్రగనర్‌లో చంద్రనగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సంతర్పణను డీకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దొడ్డి కిరణ్ ప్రారంభించారు. యూత్ సభ్యులు పాల్గొన్నారు.
- బుచ్చిరాజుపాలెం ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.



చంద్రనగర్‌లో అన్నప్రసాదాలు వితరణ చేస్తున్న దొడ్డి కిరణ్



బుచ్చిరాజుపాలెంలో..

## సమాజాభివృద్ధిలో ఇంజినీర్లు కీలకం

రాష్ట్ర కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్

**మురళీనగర్:** సమాజాభివృద్ధిలో ఇంజినీరు కీలక పాత్ర వహిస్తాడని రాష్ట్ర కాలేజీ విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఇంజినీర్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అభివృద్ధి, పరిపాలన, ప్రణాళికా రచనలో ఇంజినీర్లు ప్రధాన భూమిక పోషిస్తారన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య అంతర్జాతీయంగా పేరు పొందిన ఇంజినీరని ఆయన వారసులుగా ఇంజినీర్లు అభివృద్ధి కార్యక్రమాల్లో తమ వంతు పాత్రను సమర్థంగా నిర్వహించాలని ఆయన సూచించారు. సివిల్ ఇంజినీరింగ్ గ్యాడ్యుయేట్స్ సివిల్ సర్వెంటుగా ఉంటే ఎంత ఉపయోగమో తను అనుభవపూర్వకంగా తెలుసుకున్నానన్నారు. తాను ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు వెలుగొండ ప్రాజెక్టు మొదటి దశను పూర్తి చేశానన్నారు. ఆ జిల్లాలో నీటి నరుల రక్షణ, పునరుద్ధరణకు సమగ్రమైన ప్రణాళిక తయారు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మైనర్, మేజర్ ఇరిగేషన్‌ను ఇంటిగ్రేట్ చేసి అమలు చేస్తే మంచి ఉపయోగం ఉంటుందని తన నివేదికలో సూచించినట్లు చెప్పారు. కాబోయే ఇంజినీర్లు మంచి భవిష్యత్‌ను పొందాలని ఆయన ఆకాంక్షించారు. ముందుగా కాలేజీలో ఏర్పాటు చేసిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు. విగ్రహాన్ని కాలేజీ పూర్వ విద్యార్థులు ఎ.వరహాలు, ఎంఎస్‌డీ కుమార్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఇతర విభాగాల హెడ్‌లు, పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేముడు, ఐఎస్‌టీఈ విశాఖ జిల్లా చాప్టర్ గౌరవ కార్యదర్శి డాక్టర్ కొండల ముఖేష్, పూర్వ విద్యార్థులు వి.రామచంద్రరావు. వి.నాగభూషణరావు, బాలకృష్ణ, సత్యనారాయణ, పాల్గొన్నారు.



ప్రతిభ చూపించిన సీజీఎంలకు అవార్డులు అందజేస్తున్న అధికారులు

**ఘనంగా మోక్షగుండం జయంతి**

**సీతమ్మధార :** భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇంజినీర్స్ డే సందర్భంగా ఆదివారం సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు వి.విజయలలిత, బి.రామచంద్ర ప్రసాద్, డి.సుమన్ కల్యాణి, టి.వి.ఎస్.ఎన్. మూర్తి, బి.అశోక్‌కుమార్, పలువురు అధికారులు సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంజినీర్స్ డే సందర్భంగా విశిష్ట సేవలందించిన ఇద్దరు సీజీఎంలు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్‌లకు అవార్డులను అందజేశారు. కార్య క్రమంలో పలువురు అధికారులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్



పోలీసులకు చిక్కిన నిందితులు

**అక్కిరెడ్డిపాలెం:** సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న కంచరపాలెం ప్రాంతానికి చెందిన ముగ్గురిని గాజువాక క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. క్రైం సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లికి చెందిన కర్రి చంటిబాబు గాజువాక మార్కెట్‌లో డీజే ఈవెంట్స్ లైటింగ్ అండ్ డెకరేషన్స్‌లో పనిచేయడానికి కుదిరాడు. అయితే అతని రూ.5 వేల విలువగల ఫోను శనివారం రాత్రి పడుకున్న సమయంలో చోరీకి గురైంది. మండపంలోనే పడుకున్న చంటిబాబు సోదరుడు శివ కూడా సెల్ ఫోను పోయిందని తెలిపాడు. వెంటనే చంటిబాబు గాజువాక క్రైం పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఇటు వంటి దొంగతనాలపై గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో పలు ఫిర్యాదులు రావడంతో నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలమేరకు జాయింట్ కమిషనర్ సూచనల మేరకు క్రైం డీసీపీ కె.లతామాధురి పర్యవేక్షణలో జోన్- 2 క్రైం ఏసీపీ ఇన్‌చార్జి వెంకటరావు, సౌత్ సబ్ డివిజన్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, ఎస్ఐ మన్మథరావుతో కూడిన స్పెషల్ క్రైం టీమ్ దర్యాప్తు ముమ్మరం చేసింది. ముద్దాయిల పూర్తి సమాచారం సేకరించి ఆదివారం గాజువాక శ్రీకన్య థియేటర్ వద్ద కంచరపాలెం ప్రాంతానికి చెందిన సీలాపు అనోకు, కర్రి హేమవర్ధన్, వెతుందురి యోగిలను అరెస్ట్ చేశారు. వారి నుంచి నాలుగు మొబైల్స్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. చెడు వ్యసనాలకు బానిసై ఈజీ మనీ కోసం దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిపై గాజువాక, మల్కాపురం, పరవాడ పోలీస్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయి.

## హద్దు మీరితే చర్యలు తప్పవు

రౌడీ షీటర్లకు పోలీసుల హెచ్చరిక



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ద్వారకా సీఐ డీవీ రమణ

**సీతమ్మధార:** ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక నిమజ్జనంలో ఎటువంటి అల్లర్లు చేసిన కఠినమైన చర్యలు తీసుకుంటానని ద్వారకా సీఐ డి.వెంకటరమణ హెచ్చరించారు. ఈ మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే వేలి ముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలో 18 గణేష్ నిమజ్జనాలు జరుగుతున్నాయని తెలిపారు. ఒకొక్క గణపతి నిమజ్జనం వద్ద ఒక కానిస్టేబుల్ పర్యవేక్షిస్తారన్నారు. మద్యం సేవించి అల్లరు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసభ్యకర నృత్యలు చేస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. నిమ జ్జనం నిర్వహించే రోజు రౌడీషీటర్లను అదుపులో తీసుకుంటామన్నారు.

## చిరస్మరణీయుడు రామచంద్రమూర్తి



రామచంద్రమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళారంగ ప్రముఖులు

**డాబాగార్డెన్స్ :** రామ్‌నగర్ మెయిన్‌రోడ్డులో గల రాఘవేంద్ర స్వామి ఆలయంలో గల సమావేశ మందిరంలో ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి నేతృత్వంలో ఇటీవలే పరమపదాన్యుడైన ఇంద్రగంటి రామచంద్రమూర్తి సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ముందుగా సమితి కార్యవర్గ సభ్యులు ఆకొండి వెంకట్రావు, కె. సుబ్రహ్మణ్యం , పి. జగన్‌మోహన్‌రావు తదితరులు రామచంద్రమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సంస్మరణ సభలో వీవీ శంకరం మాట్లాడుతూ ఆధ్యాత్మిక రంగానికి, సంకీర్తన వైభవానికి తనదైన శైలిలో విశిష్ట సేవలందించిన ఇంద్రగంటి రామచంద్రమూర్తి సదా చిరస్మరణీయుడని పేర్కొన్నారు. ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ తన పరిపూర్ణమైన జీవితాన్ని భజన సాంప్రదాయం కోసం అంకితం చేసిన ఘనత రామచంద్రమూర్తికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రామచంద్రమూర్తి కుమార్తెలు డాక్టర్ గాయత్రి, గీత తదితరులు పాల్గొన్నారు.